క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి: పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయంలో 6 నుంచి 10వతరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ ఎండీ షాదుల్ సూచించారు. 6వతరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10వతరగతి వరకు మిగిలిన సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు గడువుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందని, వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు యాసంగిలో మొక్కజొన్న సాగు–దిగుబడి అనే అంశంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా వీడియో, ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: రైతు భరోసా అమలు చేయడాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి స్థానిక ప్రధాన చౌరస్తాలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు మాట్లాడారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్పొరేషన్ అధ్యక్షుడు కొటం సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పాతపల్లి ఎల్లయ్య, కొలిపాక సుజాత, బొమ్మక రాజేశ్, గట్ల రమేశ్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, చుక్కల శ్రీనివాస్, యుగంధర్, సింహాచలం, దాసరి విజయ్, ఆడెపు దశరథం, నజీముద్దీన్, గడ్డం శ్రీనివాస్, మాలెం మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలపల్లి: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కుమ్మరి శ్రీను ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నేనున్నా స్వచ్ఛంద సంస్థ తరఫున రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, నాయకులు పొలగాని సతీశ్, మల్లెత్తుల మల్లేశం, ఎండీ షాబుద్దీన్, ఆబ్బుమియా, బానాల కొమురయ్య, కుల పెద్దలు వీరయ్య, గీస శంకర్, సురేశ్ తదితరులున్నారు.

బాలింతలకు తప్పని తిప్పలు


కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఆపరేషన్ కుట్లు మానక బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్ అన్నారు. వైద్యులు కుట్లు వేసే సమయంలో నిర్లక్ష్యం వహించడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం: మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో సోమవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను రిటైర్డు మండల విద్యాధికారి ఛాయాదేవి, నోడల్ అధికారి పోతు ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంకిడి రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవి రమేశ్, చక్రవర్తి, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, మాధవీలత, మల్లారెడ్డి, కాటం మదునయ్య, సునీల్, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

గురు దత్తాత్రేయస్వామి..


పేంచికల్‌పేటలో క్యాలెండర్ల ఆవిష్కరణ

కమాన్‌పూర్: పేంచికల్‌పేట గ్రామంలో అనవేన వేణు ఆధ్వర్యంలో గురు దత్తాత్రేయ స్వామి క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. ఇంటింటా పంపిణీ చేశారు. ఇరుగురాల శేఖర్, మల్లేశ్, సంపత్, స్వామి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాలపల్లిలో వైద్యశిబిరం

పాలకుర్తి: కన్నాల పంచాయతీ పరిధిలోని శాలపల్లి గ్రామంలో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు డాక్టర్ దీక్షిత్ స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



విద్యార్థుల పొలం బాట

సుల్తానాబాద్: పట్టణంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు సోమవారం పొలం బాట పట్టారు. పొలంలో దిగి నారు ఎలా వేయడం, పొలం ఎలా దున్నడం, నాటు వేసే ముందు ఎలాంటి ఎరువులు వేస్తున్నారో స్వయంగా చూడడమే కాకుండా నాట్లు వేశారు. పాఠశాల డైరెక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. రైతు కష్టం విద్యార్థులకు తెలవాలనే ఉద్దేశంతో పొలంలో నాటు వేసే విధానాన్ని తెలిపినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

ఫెర్టిలైజర్‌సిటీ: మేడారం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాతంగి నర్సయ్య విగ్రహ ప్రతిష్ఠకు రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ భూమి పూజ నిర్వహించారు. గుమ్మడి కుమారస్వామి, మాతంగి సునీత అజయ్, మోహిత్ సన్నీ, బొంకూరు మధు, మద్దెల దినేశ్, నాతారి రాయమల్లు, ఇరుకుల రాజనర్సయ్య, మైస రాజేశ్, కంపల్ సతీశ్, మాతంగి రేణుక, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌తో జీపీ నిధుల సమీకరణ

సుల్తానాబాద్‌రూరల్: గ్రామంలో సేకరించిన చెత్తలో ప్లాస్టిక్ వస్తువులను పోగు చేసి స్క్రాప్‌కు తరలించి గ్రామ పంచాయతీకి నిధులను సమీకరిస్తున్నారు. కదంబపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డులో వేరు చేసి ప్లాస్టిక్ వస్తువులను స్క్రాప్‌లో అమ్మి నగదును జీపీ ఖాతాలో జమ చేస్తున్నట్లు కార్యదర్శి వినోద్ తెలిపారు.

పచ్చదనం.. వన మహోత్సవ లక్ష్యం


జూలపల్లి నర్సరీలో మట్టి సంచులు


సంచుల్లో మట్టి నింపుతున్న కూలీలు

- 1.30లక్షల మొక్కలకు ప్రణాళిక
- పనులు మరూ

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నర్సరీలను పెంచేందుకు ఉపాధిహామీ అధికారులు పనులు మొదలుపెట్టారు. వచ్చే వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో మొక్కలు నాటి పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు.. గ్రామీణ నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంతోపాటు 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీలో నర్సరీలను ఏర్పాటు చేయగా.. 1.30లక్షల మొక్కలు పెంచేందుకు గ్రామాల్లోని నర్సరీల్లో మట్టితో సంచులను నింపే పనులు తుది దశకు చేరాయి. జూలపల్లి, కుమ్మరికుంటలో 15వేల చొప్పున, బాలరాజుపల్లె, కీచులాటపల్లె గ్రామాల్లో 5వేల చొప్పున, మిగతా 9 గ్రామాల్లో పదేసి వేలు, మొత్తం 1.30లక్షల బ్యాగుల్లో మట్టి నింపి మొక్కల కోసం సిద్ధం చేశారు. త్వరలోనే విత్తనాలు పెట్టి మొక్కలను పెంచి రాబోయే వానాకాలం సీజన్‌లో వన మహోత్సవంలో ఊరూరా పంపిణీ చేయనున్నారు.

లక్ష్యం మేరకు పెంపకం



ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో మొక్కలు పెంచేందుకు విత్తనాలు నాటి వన మహోత్సవానికి సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సంచుల్లో మట్టి నింపే పనులు పూర్తి కావచ్చాయి. ప్రత్యేక శ్రద్ధతో మొక్కలను కాపాడి వన మహోత్సవానికి పంపిణీ చేస్తాం. – సదానందం, ఏపీవో, జూలపల్లి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని నూతుల కుంట కట్ట వద్ద సిమెంట్‌తో గద్దె ఏర్పాటు చేసినా.. ట్రాన్స్‌ఫార్మర్ మాత్రం నేలపైనే ఉన్నట్టుగా ఉంది. కుంట కట్టపై నుంచి రోజు రైతులు, కూలీలు, గీత కార్మికులతోపాటు పశువులు, గొర్రెలు, మేకలు వెళ్తుంటాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని వారు వాపోతున్నారు. విద్యుత్ శాఖకు చెందిన ఒకరు మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

దిష్టిబొమ్మ దహన యత్నం భగ్నం


నిరసన తెలుపుతున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఏఐవైఎఫ్ నాయకులు సోమవారం టౌన్ ప్లానింగ్ విభాగం దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నాలను వన్‌టౌన్ పోలీసులు భగ్నం చేశారు. స్థానిక గాంధీచౌక్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులను గుర్తించిన పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల నవీన్, రాణవేణి సుధీర్, వినయ్, పోతరాజు నాగరాజు, నరేశ్, సాయి పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న సంజీవ్‌కుమార్

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఉత్తమ జిల్లా అధ్యక్షుడిగా మాటేటి సంజీవ్‌కుమార్ ఎంపికయ్యారు. సోమవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలో లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కాకతీయ, పాలమూరు వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్ సామాజిక సేవలను గుర్తించి ఉత్తమ జిల్లా అధ్యక్షుడి అవార్డు అందజేశారు. ఉత్తమ జిల్లా కోశాధికారిగా పూసాల సాంబమూర్తి అవార్డు అందుకున్నారని సంజీవ్‌కుమార్ తెలిపారు. జూలూరి అశోక్, ఆడెపు సదానందం, జూపల్లి తిరుమల్‌రావు, ఎరవేల్లి సుధీర్‌రావు, పల్లా అనిల్, చక్రవర్తి, నోముల వేణుగోపాల్, నరేందర్, కోడూరి సతీశ్, కోడూరి వెంకటేశం, సతీశ్, దాసరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత


మాట్లాడుతున్న రాజేందర్

సుల్తానాబాద్: ధ్యానంతో మనసు ప్రశాంతంగా ఉంటుందని హార్ట్ ఫుల్‌నెస్ సెంటర్ ట్రైనర్లు రాజేందర్, శంకరయ్య అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ డైరెక్టర్ సూచనల మేరకు హెల్ప్ ప్రోగ్రాం ద్వారా హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ కార్యక్రమంలో ట్రైనర్లు ఎ.రాజేందర్, పి.శంకరయ్య సోమవారం శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, గణేశ్, దేవేందర్ సునీల్, రాజేందర్, విక్రమ్, నిర్మల, రమేశ్, అరుణ, శ్రీధర్, ప్రభాకర్, రమాదేవి, శివప్రసాద్ తదితరులున్నారు

విద్యార్థులపై దృష్టి పెట్టాలి


విద్యార్థిని సన్మానిస్తున్న ఏసీపీ రమేశ్

కమాన్‌పూర్: విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి పెడుతూ వారి నడవడిక గమనించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ సూచించారు. కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులకు హాజరయ్యారు. సైబర్ క్రైం, మత్తు పదార్థాలపై ప్రసంగించిన జూలపల్లి పాఠశాలకు చెందిన అక్షితను ఏసీపీ సన్మానించారు. గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, ప్రిన్సిపాల్ సుధాకర్, హెచ్‌ఎం సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, మాజీ సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, తిక్క రమేశ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలం.. చిన్నారులు భద్రం


సుల్తానాబాద్ ఆసుపత్రిలో బాలింతలు(ఫైల్)

సుల్తానాబాద్: జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 12 నుంచి 15 వరకు డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతున్నాయి. అడవులకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లో ఉదయం 9 గంటల వరకు పొగ మంచు వదలడం లేదు. ఇలాంటి వాతావరణాలు చిన్న పిల్లల్లో అనేక వ్యాధులకు కారణమవుతాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని లాంటి పట్టణాల్లో పలువురు చిన్న పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. జలుబు, అస్తమా, జ్వరం, నుమోనియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, మూర్ఛ, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్నట్లు పేర్కొంటున్నారు. చిన్నారులకు తాజా ఆహారంతోపాటు వేడి ఆహారమందించాలి. పండ్లు, ఆకుకూరలు, పాలు, ఉడకబెట్టిన గుడ్లు, త్వరగా జీర్ణమయ్యే ఆహారాలే పెట్టాలి. చిరు ధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి. జిల్లా కేంద్ర ఆసుపత్రితోపాటు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న పిల్లల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. మాత శిశు విభాగంలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు.

శ్రద్ధ తప్పనిసరి

ఉదయం, సాయంత్రం వేళలో పిల్లల చేతులు, కాళ్లకు వెచ్చగా ఉండే ఉన్ని దుస్తులతోపాటు స్వెట్టర్లు వేయాలి. చలికాలంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రాథమిక దశలోనే గమనిస్తే రోగాలను నయం చేయొచ్చు.

– డాక్టర్ రాజు, చిల్డ్రన్ స్పెషలిస్ట్, సుల్తానాబాద్

ఎన్టీపీసీ రామగుండం సీజీఎంకు సన్మానం


సీజీఎం సామంతను సన్మానిస్తున్న ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రతినిధులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ చందన్‌కుమార్ సామంతను ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రాజెక్టు పరిపాలనా భవనం చాంబర్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సామంతకు ఐఎన్టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఉద్యోగ గుర్తింపు సంఘం) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ శాలువా కప్పి సన్మానించారు. ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, బండారి కనకయ్య, వెంకటరెడ్డి, నేరెళ్ల రమేశ్, గోపాల్‌రావు, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న పల్లె క్రాంతిరాజును బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గజాబీంకర్ పవన్‌కుమార్ సోమవారం ఘనంగా సన్మానించారు. డాక్టరేట్ సాధించినందుకు ఆయన నివాసంలో పట్టణ శాఖ ఆధ్వర్యంలో బొకే అందించి శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ ఆచార్యులు జి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఎఫెక్ట్ ఆఫ్ మొమోర్డికా చారన్షియా ఆన్ ఫార్మకొ కైనెటిక్స్ అండ్ ఫార్మాకో డైనమిక్స్ ఆఫ్ ఓరల్ హైపో గ్లైసిమిక్ డ్రగ్స్ ఇన్ డయాబెటిక్ ర్యాట్స్ అనే అంశంపై పరిశోధనకుగాను డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కూకట్ల నాగరాజు, కందునూరి కుమార్, ఎనగందుల సతీశ్, నాగరాజు, పోచంపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

రామగుండం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు జనవరి 7న నిర్వహించబోయే వేయి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలి సమీపంలో మాదిగ సామాజిక రాజకీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వడ్డెపల్లి సురేశ్, మనుమల్ల రమేశ్, బుసిపాక సంతోష్, కుక్క గంగాప్రసాద్, సుందిళ్ల సదానందం, లంకదాసరి సదానందం, ఆరుముళ్ల సదానందం, ఈదునూరి సదానందం, అంజయ్య, వెంకటేశ్, లోకేశ్ తదితరులున్నారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు

గోదావరిఖని: యువత చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం స్థానిక హనుమాన్‌నగర్ ఏరియాలో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి అకారణంగా సీసీ కెమెరా, అదే ప్రాంతానికి చెందిన ఒక ఆటోను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆటో, ద్విచక్ర వాహనం, సీసీ కెమెరా ధ్వంసం చేసిన ముగ్గురు వ్యక్తులను గుర్తించామని అన్నారు. నిందితులు తాండ్ర విశ్వతేజ, గడ్డం అరుణ్‌కుమార్, పట్ల సాయితేజ ధ్వంసం చేసినట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. తాండ్ర విశ్వతేజ పుట్టిన రోజు శనివారం కాగా.. ఆరోజు ఉపవాసం కావడంతో ఆదివారం తన స్నేహితులతో కలిసి మద్యం మత్తులో ఇలా చేశారని వెల్లడించారు. ఎస్సై భూమేశ్, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్, భూపతి వెంకటేశ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–2లోని ఓసీపీ–3లో హెడ్ ఓవర్‌మెన్‌గా పని చేస్తున్న బత్తుల రమేశ్ రెస్క్యూ సర్వీస్‌లో 25 సంవత్సరాలు పూర్తి చేసి జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో అవార్డు అందుకున్న సందర్భంగా 8వ కాలనీ పెరిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మండ సాయిప్రణీత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హనుమాన్‌నగర్‌లోని పెరిక సంక్షేమ సంఘం కార్యాలయంలో సన్మానించారు. నాయకులు ఎంబడి పోచన్న, రావుల సందీప్, సింగతి సత్యనారాయణ, మోటపలుకుల మహేందర్, సుద్దపల్లి దినేశ్, రావుల సతీశ్, మీస ప్రవీణ్, మంచాల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ1 ఏరియాలోని జనగామ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కారం పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించారు. జీఎం లలిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చేపట్టారు. కేటగిరి–1 నుంచి కేటగిరి–6 వరకు గల ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించారు. స్థానిక గాంధీనగర్, శారదానగర్, విటల్‌నగర్, తిలక్‌నగర్, బస్టాండ్‌కాలనీలోని డీ, టీ -2, ఎంబీ, ఎస్టీ–2 టైప్ క్వార్టర్లలో ఖాళీగా ఉన్న వాటికి కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు కేటాయించారు. మొత్తం 384 క్వార్టర్లకు గాను 41 మందికి సీనియారిటీ ప్రకారం కేటాయించామన్నారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, పర్సనల్ సీనియర్ అధికారులు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, సంక్షేమాధికారులు గణేశ్, ఇక్బాల్ షరీఫ్, దేవాచారి, రవీందర్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట ధర్నా

గోదావరిఖని: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. నాయకుడు ఎంఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన స్ఫూర్తి అనే విద్యార్థిని సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రం అందుకుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని కరస్పాండెంట్ శ్రీనివాస్ అన్నారు. కరాటే మాస్టర్ రామస్వామి, రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్ తదితరులున్నారు.

అబాకస్‌లో..

గోదావరిఖనిటౌన్: శ్రీకాకతీయ జూనియర్ కళాశాలలో జీనియస్ అబాకస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో అడ్డగుంటపల్లికి చెందిన శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అయాన్ష్, యువరాజ్, బెంహెన్జాయ్ స్వర్ణ, రితిక, ఈశ్వర్, హైఫా రజత పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి తెలిపారు.

కొలనూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి

ఓదెల: కొలనూర్ గ్రామాన్ని నూతన మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ ప్రజావాణిలో సోమవారం అడిషనల్ కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి వినతిపత్రం అందజేశారు.

మద్యం మత్తులో కింద పడి మహిళ మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురి కాలనీలో ఆదివారం రాత్రి తిప్పట్ల కమల(48) మద్యం తాగి ఇంటి ఆవరణలో నడిచే క్రమంలో కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన కొడుకు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. సందీప్ ఫిర్యాదుతో ఎన్టీపీసీ ఏఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

ముత్తారం: మైదంబండలో మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించిన స్థానికులు సోమవారం రాత్రి పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ప్రేమ్‌సింగ్ మతిస్థిమితం లేక ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. సోషల్ మీడియాలో ఫొటో ఆధారంగా ప్రేమ్‌సింగ్‌ను గుర్తించిన కాంగ్రెస్ యువజన గ్రామ అధ్యక్షుడు విష్ణు, స్థానికుడు చెలుకల యుగేందర్ సహకారంతో ఆ వ్యక్తి అన్న రమేశ్, ముత్తారం ఎస్సై నరేశ్‌కు సమాచారమందించారు.